నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్






ఇంద్రవెల్లి : పాటగూడలో ప్రమాదకరమైన బావి నుంచి నీళ్లు తోడుతున్న కొలాం ఆదివాసీ మహిళలు

# తాగునీటికి తండ్లాట

## చిట్యాలబోరిలో మిషన్ భగీరథ నిర్వహణ సరిగా లేక ఇబ్బందులు

- ఫ్లోరైడ్ నీటితో సతమతం
- వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు

### ఎడ్లబండ్లపై నీళ్లు తెచ్చుకుంటున్నం

మా గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరిగా రాకపోవడంతో తాగునీటికి తీవ్ర పడుతున్నం. ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఉన్నా అవసరాలకు సరపడా నీరు సరఫరా కావడం లేదు. గ్రామంలో అందుబాటులో ఉన్న నీటిలో ఫ్లోరైడ్ ఉండడంతో ఆ నీటిని తాగడానికి ఉపయోగించడం లేదు. శుక్రవారం మిషన్ భగీరథ నీరు రాలేదు. మా అవసరాల కోసం నీటిని ఎడ్లబండ్లలో డ్రమ్ములు, బిందెలతో మోసుకుంటూ వ్యవసాయ బావుల నుంచి తెచ్చుకుంటున్నాం. మా గూడెంలో నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

**- వసంత్, చిట్యాలబోరి, ఆదిలాబాద్ రూరల్ మండలం**



### భగీరథ నీళ్లు సరిగా వస్తలేవు

మా గ్రామంలో 100 ఇండ్లు ఉన్నాయి. 500 వరకు జనాభా ఉంటుంది. ప్రతి ఇంటికీ నల్లా ఉన్నా మిషన్ భగీరథ నీరు సరిగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నం. పొద్దంతా నీళ్లు మోసుకోవడానికే సమయం సరిపోతున్నది. వ్యవసాయ, ఇతర పనులు చేసుకోలేకపోతున్నాం. మా గూడెం సమీపంలో కచ్‌కంటి వద్ద మిషన్ భగీరథ పైపు ప్రమాదకరంగా మారింది. వాగు నీటి ప్రవాహంతో పైపుల మీద సిమెంట్ దిమ్మెలు పాడయినయి. గతంలో భగీరథ నీరు బాగా వచ్చేది. ఈ సీజన్‌లో తాగునీటి సమస్య ప్రారంభం కాగా ఇంకో రెండు నెలలు ఎలా ఉంటుందోనని భయమేస్తుంది.

**-మనోహర్, గ్రామపటేల్, చిట్యాలబోరి, ఆదిలాబాద్ రూరల్ మండలం**



ఆదిలాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పల్లెల్లో తాగునీటి సమస్యలు గిరిజనులను వెంటాడుతూనే ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం నిర్వహణ సరిగ్గా లేక తాగునీరు అందక గ్రామీణులు తిప్పలు పడుతున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం చిట్యాల బోరి గిరిజన గ్రామంలో 100 ఇండ్లు ఉండగా 500 జనాభా ఉంటుంది. గ్రామంలో ఫ్లోరైడ్ నీరు ఉండడంతో స్థానికులు మిషన్ భగీరథ నీటిని తాగుతారు. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు అరకొరగా వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో గ్రామస్తులు వ్యవసాయ బావులపై ఆధారపడాల్సిన దుస్థితి వచ్చింది. ఎడ్లబండ్లపై డ్రమ్ములతో పాటు కాలినడకన బిందెలు, డబ్బాల్లో నీరు మోసుకువస్తున్నారు. కొన్ని రోజులుగా రెండు, మూడ్రోజులకోసారి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయని, అవి కూడా తక్కువగా వస్తుండడంతో తమ అవసరాలకు సరిపోవడం లేదని స్థానికులు అంటున్నారు. దీంతో వ్యవసాయ బావుల నుంచి నీటిని తీసుకువస్తున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### పాటగూడలో కొలాం ఆదివాసీలకు నీటి గోస

ఇంద్రవెల్లి, మార్చి 21 : ఇంద్రవెల్లి మండలంలోని సమక గ్రామపంచాయతీ పరిధిలోని పాటగూడకు చెందిన కొలాం ఆదివాసీ గిరిజనులు బిందెడు నీటి కోసం కిలోమీటర్ల నడవాల్సి వస్తున్నది. సమక గ్రామపంచాయతీ పరిధిలోని పాటగూడలో 63 ఉమ్మడి కుటుంబాలు ఉండగా 450 మంది జనాభా ఉంది. తాగునీటి కోసం గతంలో అధికారులు ఓ వ్యవసాయ భూమిలో బోరుబావితో పాటు రెండు చేతి పంపులను ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రతకు బోర్లు, చేతిపంపులు అడుగంటిపోయాయి. మిషన్ భగీథర పథకం పైపులైన్ మధ్యలోనే పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. కొన్ని రోజులుగా తాగునీటికి కొలాం ఆదివాసీ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం గ్రామస్తులు సమీపంలోని వ్యవసాయ బావులకు వెళ్లి నీటిని బిందెలు, క్యాన్లలో మోసుకువస్తున్నారు. ఆ బావిలోకి దిగి బిందెడు నీళ్లు తెచ్చేందుకు అనేక కష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి ఎద్దడితో గ్రామాల్లో పెళ్లి వేడుకలు నిర్వహించాలంటే భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపు లైన్‌కు మరమ్మతులు చేసి ప్రతి రోజూ తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.



ఆదిలాబాద్ రూరల్ మండలం చిట్యాలబోరిలో వ్యవసాయబావి నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు



పాటగూడలో బిందెలతో నీటిని మోసుకొస్తున్న కొలాం ఆదివాసీ మహిళలు



ఇంద్రవెల్లి : మరమ్మతులకు నోచుకోని సమక గ్రామ శివారులోని మిషన్ భగీరథ పైపులైన్

### తాగునీటి బాధలను తీర్చాలి

ఇంద్రవెల్లి, మార్చి 21 : తాగునీటి బాధలను అధికారులు పట్టించుకొని పరిష్కరించాలి. నా చిన్నప్పటి నుంచి తాగునీటి కష్టాలను పడుతూనే ఉన్నాం. గ్రామంలో నీళ్లు లేక దగ్గరల్లోని వ్యవసాయ బావుల నుంచి తాగునీళ్లు తీసుకోస్తున్నాం. ఇంటికి బంధువులతోపాటు చుట్టాలు కాని, ఎవరైనా వస్తే వారికి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఉంది. మాకు పీడిస్తున్న నీటి కష్టాలు తీర్చి ఆదుకోవాలి. గ్రామానికి చెందిన రెండు చేతిపంపులు అడుగంటిపోయినయ్. బావిలో దిగి నీళ్లను మోసుకురావాలంటే ఇబ్బందిగా ఉన్నది.

**-కొడప లక్ష్మీబాయి, పాటగూడ**



# రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

- సుమారు 12,202 మెట్రిక్ టన్నుల తేడా గుర్తించినట్లు అధికారుల వెల్లడి
- వీటి విలువ సుమారు రూ.26 కోట్లు !

ఖానాపూర్ రూరల్, మార్చి 21: నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ మండలంలో సత్తనపల్లిలో అధికార పార్టీ నాయకుడికి చెందిన రైస్ మిల్లులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తనిఖీలు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీల్లో 12,202.203 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం తేడాగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.26 కోట్ల వరకు ఉంటుందన్నారు. ఏఆర్ఎస్ ఇండస్ట్రీయల్ మిల్లులో రబీ సీజన్ 2022-2023-సంవత్సరానికి 5535.394 మెట్రిక్ టన్నులు, రబీ సీజన్ 2023-2024 సంవత్సరానికి 2783.060 మెట్రిక్ టన్నులు తేడాగా ఉందని గుర్తించారు. ఏఆర్ఎస్ ఆగ్రో మిల్లులో రబీ సీజన్ 2022-2023 సంవత్సరానికి 3883.749.మెట్రిక్ టన్నులు తేడాగా ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. పూర్తి విచారణ అనంతరం రెవెన్యూ రీకవరి యాక్ట్ ప్రకారం అవసరమైతే యాజమాన్యంపై కేసులను నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఓఎస్డీ స్పెషల్ టీం అధికారి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రంజిత్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు తిరుపతి, అజిశ్, తదితరులు ఉన్నారు.



సత్తనపల్లిలో ఏఆర్ఎస్ మిల్లులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ టీం అధికారులు



ముథోల్‌లో నేలకొరిగిన మక్క

# అకాల వర్షం..అన్నదాతకు నష్టం

ముథోల్, మార్చి, 21 : నిర్మల్ జిల్లాలోని ముథోల్ మండల కేంద్రంతో పాటు ఆష్టా, గన్నోరా, రువ్వి, బ్రాహ్మణ్‌గావ్‌తో పాటు తదితర గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షం పడడంతో రైతులకు నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన మక్క, జొన్న పంటలు పూర్తిగా నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేయించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



నేలవాలిన జొన్న

# 'పది' పరీక్షలు ప్రారంభం

- అన్ని కేంద్రాల వద్ద పట్టిష్ట బందోబస్తు
- తనిఖీలు చేసిన ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లు, ఎస్పీలు

ఎదులాపురం, మార్చి 21: పదవ తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 10,043 మంది విద్యార్థులకు గాను 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ (144 సెక్షన్)ను అమలు చేశారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు. పరీక్ష సమయం కంటే గంట ముందు నుంచే విద్యార్థులను లోనికి అనుమతించారు. ఎండల దృష్ట్యా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. తొలి రోజు పరీక్షకు 10,013 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరైనట్లు ఆదిలాబాద్ డీఈవో ప్రణిత తెలిపారు. విద్యానగర్‌లో జడ్పీ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. పరీక్ష నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, అధికారులున్నారు. లిటిల్ స్టార్‌లోని సెంటర్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. బందోబస్తుపై పోలీసులకు పలు సూచనలు చేశారు.



కడెం: పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

### నిర్మల్ జిల్లాలో

నిర్మల్ అర్బన్/సోన్ /భైంసా, మార్చి, 21 : నిర్మల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గంట ముందు నుంచే కేంద్రాల్లోకి విద్యార్థుల హాల్ టికెట్లను తనిఖీ చేసి లోనికి పంపించారు. అన్ని కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ (144 సెక్షన్) అమలు చేశారు. నిర్మల్ పట్టణంలోని రవి ఉన్నత పాఠశాల, సోన్‌లోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటి వసతి, టాయిలెట్లు, వైద్య సదుపాయాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట డీఈవో రామారావు, అధికారులున్నారు. పలు పరీక్షా కేంద్రాలను ఏఎస్పీ రాజేశ్ మీనా, సీఐ ప్రవీణ్ కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. భైంసా పట్టణంలో బాలికల ఆశ్రమ పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సెంటర్ల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023ను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐలు గోపీనాథ్, నైలు, తదితరులు ఉన్నారు.



ఆదిలాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా



నిర్మల్ లో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

# సేవా కార్యక్రమాలకు ముందుకురావాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- రూ.10 లక్షల విలువైన వినికిడి పరికరాలు అందజేత

ఉట్నూర్, మార్చి 21: ప్రత్యేక అవసరాల పిల్లలకు వినికిడి పరికరాలు అందించడం అభినందనీయమని, మరిన్ని సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. ఉట్నూర్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికాసం పాఠశాలలో వినికిడి లోపం పిల్లలకు హైదరాబాద్‌కు చెందిన ఆశ్రయ్ ఆకృతి కంపెనీ రూ.10 లక్షల విలువైన వినికిడి పరికరాలు అందించడంపై వారికి ఐటీడీఏ పీవో కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మనోహర్, ఏవో రఘు, ఏటీడీవో క్రాంతి, పాఠశాల ప్రిన్సిపాల్ వికాస్, ఉపాధ్యాయులు, ఆకృతి సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

### తాగునీటి సరఫరా బాధ్యత పంచాయతీ సెక్రెటరీలదే..

గిరిజన గ్రామాల్లో తాగునీటి సరఫరా బాధ్యత పంచాయతీ సెక్రెటరీలదేనని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల దృష్ట్యా గిరిజన గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇంటింటికీ మంచినీళ్లు అందించాల్సిన బాధ్యత పంచాయతీ సెక్రెటరీలదేనని ఆదేశించారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, క్లోరినేషన్ జరిగే విధంగా చూడాలని ఎంపీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ తానాజీ, డీఈ శివప్రసాద్, డీఎల్పీవో ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ సెక్రెటరీలు, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థికి వినికిడి పరికరం అమర్చుతున్న ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

# సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ చేపడుతాం

**డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్**

బేల, మార్చి 21 : బేలలోని ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. బేల మండలంలోని ప్రభుత్వ దవాఖాన'లో గురువారం రాత్రి పీట్‌గావ్ గ్రామానికి చెందిన నిండు గర్భిణీ దవాఖానకు రాగా విధుల్లో ఉండాల్సిన స్టాఫ్ నర్స్ లేక ఇబ్బంది పడింది. ఈ విషయంపై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది.

**● 'నమస్తే'కు స్పందన**

'రాత్రివేళ గర్భిణీ అవస్థలు' అనే కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా విచారణ చేపట్టి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను ఆదేశించారు. ఈ మేరకు విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.